శనగ రైతుకు భరోసా

- మద్దతు ధరతో పప్పు శనగ కొనుగోళ్లకు శ్రీకారం
- బహిరంగ మార్కెట్లో క్వింటం రూ.4,600
- ప్రభుత్వం రూ. 5,335 ప్రకారం కొనుగోలు
- రైతుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం

కోడుమూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలబడుతోంది. విత్తనం మొదలు పంట దిగుబడి కొనుగోలు వరకు మద్దతు ఇస్తోంది. తాజాగా రబీ సీజన్‌లో పండించిన శనగల కొనుగోలుకు శ్రీకారం చుట్టింది. గత ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితులతో సాగు చేసిన వివిధ పంటలు దెబ్బ తిన్నాయి. దీంతో రైతులు రబీ కింద అత్యధికంగా శనగ సాగు చేశారు. కోడుమూరు మండలంలోనే 9,600కుపైగా హెక్టార్లల్లో ఈ పంట వేశారు. అయితే, ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో పప్పుశనగకు గిట్టుబాటు ధరలేక రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు నెలకొనడంతో రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. ప్రస్తుతం మార్కెట్లో క్వింట శనగలు రూ.4,600 పలుకుతుండగా, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సర్కారు రూ.5,335 ప్రకారం కేడీసీఎంఎస్ ద్వారా కొనుగోలుకు శ్రీకారం చుట్టింది. మార్కెట్ ధర్పై రూ. 735 పెంచడంతో రైతులు విక్రయానికి ఆసక్తి చూపుతున్నారు. దీంతో చాలా మంది రైతులు రైతుభరోసా కేంద్రాల్లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. పేర్ల రిజిస్ట్రేషన్ ఆధారంగా కేడీసీఎంఎస్ అధికారులు గత 5 రోజుల నుంచి మండలంలో శనగ దిగుబడుల కొనుగోలు ప్రారంభించారు.


కోడుమూరులో మద్దతు ధరతో శనగలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

గతంలో కష్టపడి పండించిన పంటలకు మార్కెట్లో గిట్టుబాటు ధర లేక పెట్టిన పెట్టుబడులు రాక రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి పంటకు గిట్టుబాటు ధర ప్రకటించడమే కాక కొనుగోలు కూడా చేపడుతోంది. ప్రస్తుతం మార్కెట్లో శనగల ధర పడిపోయింది. ఈ సమయంలో సర్కారు మద్దతు ధరతో కొనుగోలుకు ముందుకు రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో రైతు నుంచి ఎకరాకు 4 క్వింటాళ్ల చొప్పున గరిష్టంగా 100 క్వింటాళ్ల వరకు మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. కోడుమూరు మండలంలో ఐదురోజుల్లోనే 1,378 క్వింటాళ్ల శనగలు కొనుగోలు చేసినట్లు వారు వెల్లడించారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



పప్పు శనగ సాగు చేసిన రైతులు మార్కెట్లో గిట్టుబాటు ధర లేక నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వం కేడీసీఎంఎస్ ద్వారా మద్దతు ధరపై కొనుగోలు చేస్తోంది. శనగలు పండించిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకుంటే చాలు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

–రవిప్రకాష్, ఏఓ, కోడుమూరు

సంతోషంగా ఉంది



సొంత పొలం 20 ఎకరాలతో పాటు మరో 20 ఎకరాలను కౌలుకు తీసుకుని శనగ పంట సాగు చేశా. తుఫాన్ ప్రభావంతో పంట దెబ్బతినడంతో శనగ దిగుబడులు అంతంతమాత్రంగానే వచ్చాయి. పండిన పంటకు మార్కెట్లో గిట్టుబాటు ధరలేదు. అయితే రాష్ట్ర ప్రభుత్వం మేము నష్టపోరాదన్న ఉద్దేశంతో మద్దతుధరపై కొనుగోలు చేస్తుండడం చాలా సంతోషంగా ఉంది. – రైతు తిప్పారెడ్డి , కోడుమూరు

క్లుప్తంగా

మహిళలకు ముగ్గుల పోటీలు


ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

పాణ్యం: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రం పాణ్యంలోని పొదుపు కార్యాలయం ఎదుట సోమవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం ప్రసాద్ పోటీల్లో గెలుపొందిన వారికి 8వ తేదీన బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ కార్యక్రమంలో మండల పొదుపుసంఘం అధ్యక్షురాలు సరళమ్మ, కార్యదర్శి లక్ష్మీదేవమ్మ, కోశాధికారి సుబ్బమ్మ, సీసీలు పాల్గొన్నారు.

మిత్ర పురుగులతో ప్రయోజనం


ఇనగండ్లలో పొలం బడి నిర్వహిస్తున్న ఏఓ

సి.బెళగల్: పంటపొలాల్లో మిత్ర పురుగుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ రైతులకు సూచించారు. సోమవారం ఆయన మండల పరిధిలోని ఇనగండ్ల గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. సంధ్య పోగు భాస్కర్ అనే రైతుకు చెందిన వేరుశనగ పంటలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పంటల రక్షణ, అధిక దిగుబడులపై అవగాహన కల్పించారు. పురుగుల గుర్తింపునకు వినియోగించే స్వాప్ నెట్స్‌ను వాడే విధానాన్ని వివరించారు. అలాగే అధిక మొత్తంలో రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడితే లాభం కన్నా నష్టమే ఎక్కువ అని వెల్లడించారు.

అభ్యాసన నైపుణ్యాలు పెంచాలి


సి.బెళగల్ స్పెషల్ ప్రాథమిక పాఠశాల తనిఖీ చేస్తున్న ఎంఈఓ జ్యోతి

సి.బెళగల్: విద్యార్థులకు అభ్యాసన నైపుణ్యాలు పెంచాలని ఎంఈఓ జ్యోతి ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం ఆమె మండల కేంద్రం సి.బెళగల్ స్పెషల్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు రాసిన పాఠ్యాంశ ప్రణాళికలను, వర్క్‌బుక్కులు, డైరీల నిర్వహణను పరిశీలించి టీచర్లకు సూచనలు చేశారు. అదేవిధంగా విద్యార్థులను పాఠ్యాంశాలను చదివించి వారి అభ్యసన నైపుణ్యాలను పరీక్షించారు. కాగా పలువురు విద్యార్థులు పదాలను, అక్షరాలను గుర్తుపట్టకపోవడంపై ఎంఈఓ ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌వీఎఫ్ నాయకుడు రవీంద్ర

ఓర్వకల్లు: నియోజకవర్గంలో స్థాపిస్తున్న పరిశ్రమల్లో స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్, ఆలిండియా యూత్ లీగ్ జిల్లా అధ్యక్షుడు రాజు కోరారు. సోమవారం స్థానిక బుగ్గరామేశ్వర డిగ్రీ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ పాణ్యం , ఓర్వకల్లు మండలాల్లో ఏర్పాటు చేస్తున్న సోలార్, డీఆర్‌డీఓ, ఎయిర్ పోర్ట్, జయరాజ్ ఇస్పాత్(స్టీల్ ప్లాంట్) పరిశ్రమల్లో స్థానిక యువతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమావేశంలో నాయకులు వెంకటస్వామి, అశోక్, రఫి, తరుణ్, రవీంద్ర, మధుసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ సోమన్నకు నివాళి


మాట్లాడుతున్న కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ

కర్నూలు(న్యూటౌన్) : రాజకీయాల్లో నీతి, నిజాయితీకి మారుపేరు కామ్రేడ్ సోమన్న అని కర్నూలు మండల అధ్యక్షురాలు ధర్మవరం వెంకటేశ్వరమ్మ అన్నారు. సోమవారం గొందిపర్ల గ్రామంలో సోమన్న ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సోమన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన స్మారక గ్రంథాలయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నారాయణ, బి.తాండ్రపాడు సర్పంచు బాలపీరా, మండల కమిటీ సభ్యుడు ఆంజనేయులు, గొందిపర్ల సర్పంచ్ శ్రీనివాసులు, మాజీ మండల ఉపాధ్యక్షులు వాసు, సీపీఎం మండల కార్యదర్శి హుసేనయ్య తదితరులు పాల్గొన్నారు.

సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి ఎగువ నుంచి నీటి ప్రవాహం కొనసాగుతోంది. సోమవారం 1,120 క్యూసెక్కుల నీరు రాగా కేసీ కాల్వకు 935 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాంలో ప్రస్తుతం 0.751 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

9న మున్సిపల్ వేలాలు

గూడూరు: 2023–24 ఆర్థిక సంవత్సరానికి గూడూరులోని పలు మార్కెట్‌లకు ఈనెల 9న వేలాలు నిర్వహించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. వారపు సంత, రోజువిరి కూరగాయల మార్కెట్, గొర్రెలు, పశువుల మాంసపు మార్కెట్ తదితర వాటికి వేలం వేయనున్నట్లు వెల్లడించారు.

సంక్షేమ సారథి జగనన్న

కల్లూరు: సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కల్లూరు అర్బన్ జేసీఎస్ ఇన్‌చార్జ్ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 26వ వార్డులో ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచార కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దండు లక్ష్మీకాంతరెడ్డి, వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు

- వైద్య సిబ్బందికి డీఎంఅండ్‌హెచ్ఓ రామగిడ్డయ్య ఆదేశం

కోడుమూరు రూరల్: పీహెచ్‌సీల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంఅండ్ హెచ్ఓ రామగిడ్డయ్య ఆదేశించారు. మండలంలోని లద్దగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం డీఎంఅండ్‌హెచ్ఓ తనిఖీ చేసి పీహెచ్‌సీ రికార్డులు, సిబ్బంది పనితీరు, ప్రజలకందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వైద్యసిబ్బంది తరచూ పర్యటిస్తూ ఉండాలని, ముఖ్యంగా యుక్తవయస్సు గల బాలికల్లో రక్తహీనత ఉన్న వారిని గుర్తించి పోషకాహారం, మందులు అందేలా చూడాలన్నారు. అలాగే గర్భిణులు ఆసుపత్రుల్లో సుఖప్రసవం అయ్యేలా చూడాల్సిన బాధ్యత వైద్యసిబ్బందిదేనన్నారు. అనంతరం మండలంలోని రామాపురంలో ఫ్యామిలీడాక్టర్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో లద్దగిరి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా.నస్రీమ్, సీహెచ్ఓ శాంత, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్‌యాదవ్, 104 సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


లద్దగిరి పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్ఓ రామగిడ్డయ్య

జాతీయ ఆర్చరీ పోటీలకు కర్నూలు క్రీడాకారిణి

కర్నూలు(టౌన్): ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు గుజరాత్ రాష్ట్రం ఎక్తా నగరంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు కర్నూలు నగరానికి చెందిన సాయి గీతిక ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో ఆ క్రీడాకారిణిని సోమవారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలోని తన చాంబర్‌లో సీఈఓ రమణ, వైద్యులు డాక్టర్ శంకర్ శర్మ శాలువాతో ఘనంగా సత్కరించారు. రూ.5 వేలు ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు. ఆర్చరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాగరత్నమయ్య మాట్లాడుతూ..ఈ ఏడాది ఫిబ్రవరి 28 నుంచి మార్చి 2వ తేదీ వరకు శాలి వాహన డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో సాయిగీతిక ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కోచ్ వంశీకృష్ణ, తేజస్విని తదితరులు పాల్గొన్నారు.


జాతీయ పోటీలకు ఎంపికైన సాయిగీతికను సన్మానిస్తున్న స్టేడియం సీఈఓ, వైద్యులు

చేనేత హస్త కళల ప్రదర్శన ప్రారంభం

కర్నూలు (టౌన్): నగరంలోని బి.క్యాంపు విజ్ఞాన మందిరం సమావేశ హాలులో సోమవారం చేనేత హస్త కళల ప్రదర్శన ప్రారంభమైంది. కళాజ్యోతి హ్యాండీక్రాఫ్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన, అమ్మకాలను వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు ఎస్‌వీ విజయ మనోహరి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేత హస్త కళలకు చేయూత ఇద్దామని పిలుపునిచ్చారు. చీరెలు, కలంకారి వస్తువులు, జ్యూట్ బ్యాగ్స్, హైదరాబాదు ముత్యాలు, కొండపల్లి బొమ్మలు ఎన్నో రకాల వస్తువులు తక్కువ ధరకు అందిస్తున్నట్లు చెప్పారు. సంస్థ నిర్వాహకులు పసుపులేటి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ. ఈ నెల 23వ తేదీ వరకు ఈ ప్రదర్శన ఉంటుందని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ప్రణాళికతో ఫలితం 'పది'లం

- పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాశాఖ చర్యలు
- ప్రత్యేక ప్రణాళికతో నైట్ విజన్ తదితర కార్యక్రమాలు
- సీ, డీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

కర్నూలు సిటీ: పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ ముందస్తు చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. అధికారులు ప్రత్యేక ప్రణాళికతో విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. నైట్ విజన్ కార్యక్రమం పేరుతో పిల్లల్లో ఆత్మస్థైర్యం నింపుతున్నారు. పిల్లల చదువు పట్ల తల్లిదండ్రుల్లో కూడా బాధ్యత పెంచుతున్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న సబ్జెక్టు టీచర్లతోపాటు జిల్లాలో వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న సబ్జెక్టు నిపుణుల చేత ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. అదేవిధంగా ఫార్మేటివ్ అసెస్‌మెంట్(ఎఫ్ఏ) పరీక్షల నుంచి రివిజన్ టెస్టులలో వచ్చిన ఫలితాలను బట్టి చూస్తుంటే ఈ సారి వందశాతం ఉత్తీర్ణత వచ్చేలా స్పష్టంగా కనబడుతుంది. ఈ నెల 7వ తేదీతో నాల్గవ రివిజన్ టెస్ట్ పూర్తి అవుతుంది. ఈ నెల 9 నుంచి 20వ తేదీ వరకు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది గతంలో కంటే భిన్నంగా జనవరి నాటికి దాదాపు అన్ని సబ్జెక్టుల సిలబస్ పూర్తి చేశారు.

పరీక్షలకు 9,526 మంది :

నైట్ విజన్ కార్యక్రమం పేరుతో విద్యాశాఖ అధికారులు రాత్రి వేళల్లో విద్యార్థుల ఇళ్లకు వెళ్తున్నారు. పిల్లల సామర్థ్యాలపై తల్లిదండ్రులతో చర్చించి వారు చదువుకునేలా వాతావరణం కల్పిస్తున్నారు. అదేవిధంగా విద్యార్థులకు ఫార్మేటివ్ అసెస్‌మెంట్–1 పరీక్ష నిర్వహించిన తరువాత అందులో వచ్చిన ఫలితాల ఆధారంగా అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసి ఏ,బీ,సీ,డీ గ్రేడ్‌లుగా విభజించారు. సీ,డీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో ఫార్మేటివ్–2 పరీక్షల నాటికి వారి అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ఆయా హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులతోపాటు ఏ రోజుకు ఆ రోజు స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నారు. స్లిప్ టెస్టులలో వచ్చిన ఫలితాల ఆధారంగా మార్కులు తక్కువ వచ్చిన పిల్లలకు ప్రత్యేకంగా పునరుశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ చేపట్టిన చర్యలు ఫలితాలు ఇస్తున్నాయి. కర్నూలు జిల్లాకు చెందిన విద్యార్థులు 9,526 మంది పరీక్షలు రాయనున్నారు. ఫలితాల పెంపులో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఈఓ, డిప్యూటీ డీఈఓ, డీఈఓలను భాగస్వాములుగా చేశారు.


నైట్ విజన్‌లో భాగంగా విద్యార్థినులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈఓ (ఫైల్)

పిల్లల్లో ఆత్మస్థైర్యం పెంచేలా చర్యలు

పది పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు వేశాం. కలెక్టర్ ఆదేశాల మేరకు రెగ్యులర్ పర్యవేక్షణతో పాటు, రాత్రి వేళల్లో పిల్లల ఇళ్లకు వెళ్లి వారిలో ఆత్మస్థైర్యం పెంచేలా తీసుకుంటున్న చర్యలు ఫలితాలు ఇస్తున్నాయి. ఎఫ్ఏ–1, ఎఫ్ఏ–2, రివిజన్ టెస్టుల ఫలితాలను బట్టి చూస్తే ఉత్తీర్ణత శాతం అంచనాలకు తగ్గట్టు వస్తున్నాయి.

– డా.వెంకట రంగారెడ్డి, డీఈఓ

రవీంద్రారెడ్డిని గెలిపించండి

గూడూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని గూడూరులో ఆ పార్టీ నాయకులు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు ఎల్.వెంకటేశ్వర్లు, మునిసిపల్ కౌన్సిలర్లు పి.రామాంజనేయులు, విజయ్, దస్తగిరి, కుమార్, కలామ్, తెలుగు మదు, తదితరులు ఈ ప్రచారంలో పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేసుకోండి

గూడూరు రూరల్: శనగ రైతులు పంట విక్రయానికి ఆర్‌బీకేల్లో పేరు నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి శ్రీవర్ధన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు. క్వింటం రూ.5335 చొప్పున కొనుగోలు చేయనుందని వెల్లడించారు.

ఉలిందకొండవాసుల ఆందోళన

కల్లూరు: ఉలిందకొండ గ్రామ సమీపంలోని క్వారీలలో నిబంధనలకు విరుధంగా బోర్ బ్లాస్టింగ్ చేస్తున్న కంకర మిషన్ల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉలిందకొండ గ్రామస్తులు కోరారు. సోమవారం గ్రామస్తులు క్వారీల దగ్గర జరుగుతున్న బ్లాస్టింగ్ పనులను పరిశీలించి ఆందోళన వ్యక్తం చేశారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్


రాళ్లపల్లి రమణమ్మ

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఫిజిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న రాళ్లపల్లి రమణమ్మకు డాక్టరేట్ లభించింది. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ జయచంద్ర ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'బ్యాటరీ మరియు సూపర్ కెపాసిటర్ల శక్తి ఎర్త్ ఈఎన్స్ బేరియం నానో సెరమిక్స్ బెస్ట్ ప్యారడిక్ ఎనర్జీ స్టోరేజ్' అనే అంశంపై చేసిన పరిశోధనకు అనంతపురం జేఎన్‌టీయూ డాక్టరేట్ ప్రకటించినట్లు వెల్లడించారు. కాలేజీ చైర్మన్ శాంతిరాముడు, డీన్ ఆశోక్‌కుమార్, తోటి సిబ్బంది రమణమ్మను సోమవారం అభినందించారు.

ప్రారంభమైన రంగల్‌దర్వేశి తిరునాల

గడివేముల: ఒండుట్ల గ్రామ సమీపంలోని ఎర్రమల కొండల్లో వెలసిన లక్ష్మీరంగనాయకస్వామి, రంగల్ దర్వేశి ఖాద్రి స్వామివార్ల ఉత్సవాలు సోమవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. గని గ్రామంలో రంగనాయక స్వామివార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తులకు ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించి స్వామి వారిని ఆలయానికి తీసుకెళ్లారు. అలాగే రంగల్‌దర్వేశి ఖాద్రి స్వామికి గంధం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాల్లో ఎంపీపీ నాగమద్దమ్మ, సర్పంచ్ కత్తి తులసమ్మ, ఆలయ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ శివానందరెడ్డి పాల్గొన్నారు.

పోస్టాఫీసు ఏర్పాటుపై నివేదిక ఇవ్వండి

కర్నూలు(రాజ్‌విహార్): అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండలం తల్లెంవారిపల్లి గ్రామంలో పోస్టాఫీసు ఏర్పాటు చేసేందుకు నివేదిక ఇవ్వాలని కర్నూలు రీజియన్ డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ ఎం.జగదీష్‌పాయ్‌ను ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్టు మాస్టర్ జనరల్ డాక్టర్ అభినవ్ వలియా ఆదేశించారు. అదే మండలం గడేల గ్రామంలోని బ్రాంచ్ పోస్టాఫీసును తరలించి ఓబులవారిపల్లెలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి విన్నపాలు వచ్చాయని, ఈ నేపథ్యంలో పూర్తి స్థాయి అధ్యాయనం చేసిన నివేదికలు ఇవ్వాలని కోరారు.

క్లౌడ్ కంప్యూటింగ్‌పై అవగాహన

కర్నూలు సిటీ: స్థానిక జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విద్యార్థులకు క్లౌడ్ కంప్యూటింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో అమెరికా దేశంలోని న్యూటానిక్స్‌లో సీనియర్ టెక్నిషియన్ కిరణ్ పాల్గొని ప్రసంగించారు. అమెజాన్, మైక్రోసాఫ్ట్, గుగూల్ వంటి సంస్థలు అందించే క్లౌడ్ కంప్యూటింగ్ సేవల గురించి ఆయన వివరించారు. ఈ సదస్సులో కాలేజీ ప్రిన్సిపాల్ డా.సి శ్రీనివాసరావు, సహాయ ఆచార్యులు డి.జయనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన కోడుమూరు ఎమ్మెల్యే


సీఎం వైఎస్ జగన్‌తో కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ దంపతులు

కర్నూలు(రాజ్‌విహార్): కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ దంపతులు సోమవారం అమరావతిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నియోజకవర్గంలోని అభివృద్ధి, పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ కేంద్రం కోడుమూరుకు డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని కోరారు. వర్కూరు రోడ్డులో ఉన్న ఇంటర్మీడియట్ కళాశాలకు 10 ఎకరాల స్థలం ఉందని, అందులోనే డిగ్రీ కళాశాల కూడా ఏర్పాటు చేసుకోవచ్చని సీఎంకు వివరించారు. కోడుమూరులో తాగునీటి సమస్య పరిష్కారానికి ఇప్పటికే రూ.25కోట్లు మంజూరు చేశారని, ఈ పనులకు వారం రోజుల్లో టెంటర్లు పిలిచే అవకాశం ఉందన్నారు. తద్వారా ప్యాలకుర్తి, వర్కూరు, వెంకటగిరి, పులకుర్తి పక్కల గ్రామాల మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు.

నవధాన్యాల సాగు ప్రయోజనకరం

ఓర్వకల్లు: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నవధాన్యాలను సాగు చేయడం ద్వారా పర్యావరణానికి, నేల తల్లికి ప్రయోజనం చేకూరుతుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్, కన్సల్టెన్సీ లక్ష్మయ్య అన్నారు. సోమవారం స్థానిక మండల సమాఖ్య భవనంలో పొదుపు మహిళలతో నిర్వహించిన సమావేశంలో వారు అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఖరీఫ్ కంటే ముందు 30 రకాల నవధాన్య విత్తనాలను ఎకరాకు 13 కిలోలు చొప్పున విత్తుకోవాలన్నారు. ఇందులో పచ్చిరొట్టె , పప్పుధాన్యం, ఆకుకూరలు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలకు సంబంధించిన విత్తనాలు ఉండేలా చూసుకోవాలన్నారు. రసాయనాలతో పండించిన పంటలను తినడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు ఉంటాయన్నారు. ఈ దిశగా ప్రజలను చైతన్య పరిచి ప్రకృతి వ్యవసాయ పంట ఉత్పత్తులనే వాడేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటరామిరెడ్డి, సీసీలు, సమాఖ్య మండల అధ్యక్ష, కార్యదర్శులు విజయలక్ష్మి, మైమున్నీసాబేగం, మాస్టర్ ట్రైనర్స్ మురళీ మోహన్, మార్కెటింగ్ ఇన్‌చార్జి ఎంటీ ఆంజనేయులు, హెచ్ఎన్‌ఎంటీలు, ఎంఎస్‌ఓబీలు, వివిధ గ్రామాలకు చెందిన వీఓలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి

గూడూరు రూరల్: విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనం అందించాలని ఎంఈఓ సునీలమ్మ హెచ్‌ఎంలకు సూచించారు. బూడిదపాడు, కె.నాగలాపురంలోని పాఠశాలలను సోమవారం ఆమె తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా చూడాలని, హాజరు శాతాన్ని పెంచాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని హెచ్‌ఎంలు పర్యవేక్షించాలన్నారు.

పోలకల్‌లో భక్తజన సందడి


తరలివచ్చిన ఫలహార బండ్లు


ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవారి విగ్రహాలు

- వైభవంగా శ్రీ చెన్న సోమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు
- నేడు మహారథోత్సవం

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో చెన్న సోమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. పలువురు స్వామికి తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. వసతితో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ ధర్మకర్త పద్మనాభరెడ్డి తెలిపారు.

ఆకట్టుకున్న ఫలహారాల బండ్లు

ఉత్సవాల్లో భాగంగా సోమవారం భక్తులు ఫలహార ఎడ్ల బండ్ల ఊరేగింపు నిర్వహించారు. రంగురంగుల కాగితాలు, మామిడి తోరణాలతో బండ్లను సుందరంగా అలంకరించారు. మండల కేంద్రం సి.బెళగల్‌తో పాటు కంబదహాల్, సంగాల, పలుకుదొడ్డి, క్రిష్ణదొడ్డి, ముడుమాల, ఇనగండ్ల, మారందొడ్డి గ్రామాలకు చెందిన భక్తులు ఎక్కువ సంఖ్యలో ఎడ్ల బండ్లపై పోలకల్ చేరుకుని స్వామి వారికి ఫలహారాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు రథోత్సవం, పార్వేట

మంగళవారం వేకువజాము 4:30 గంటలకు స్వామి రథోత్సవం, సాయంత్రం పార్వేట నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకుడే బీచుపల్లయ్య తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోడుమూరు సీఐ శ్రీధర్ బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు.


చెన్నసోమేశ్వర స్వామిని దర్శించుకునేందుక క్యూలో నిల్చున్న భక్తులు